క్లుప్తంగా

నేడు సిద్దారెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేసి అవసరమైన మందులను అందజేస్తామని వైద్యాధికారి పేర్కొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

గోపవరం : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి భూసారవంతం కోసం ఉపయోగించే పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ తెలిపారు. మండలంలోని 6 రైతుభరోసా కేంద్రాలకు 145 క్వింటాళ్ల జీలుగలు, 18 క్వింటాళ్ల జనుములు వచ్చాయన్నారు. 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామన్నారు. సబ్సిడీపోను 10 కేజీల జీలుగలు రూ.395లు, 10 కేజీల జనుములు రూ.420లు రైతు వాటాగా చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్‌ఫోన్ ఆయా రైతుభరోసా కేంద్రాలకు తీసుకెళ్లి పచ్చిరొట్ట విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు.

ఖాళీలను భర్తీ చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, సృజన్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.34 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు.స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో సోమవారం ఉద్యోగాల సాధన కోసం క్రియాశీలక ఉద్యమాలు అనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగాలు, ఉపాధ్యాయ ఉద్యోగాలు, పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా క్రియాశీలక ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజారామ్మోహన్‌రాయ్ జయంతి



రాజారామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జేవీవీ కార్యాలయంలో సోమవారం రాజారామ్మోహన్‌రాయ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజారామ్మోహన్‌రాయ్ బహు భాషా కోవిదుడని, వితంతు పునర్వివాహాలను, స్త్రీవిద్యను ప్రోత్సహించారన్నారు. బ్రహ్మ సమాజాన్ని స్థాపించారన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, కోఆర్డినేటర్లు జాహ్నవి, అక్షయ, హాసిని, జావెద్, అద్నాన్, నిఖిల్ తేజేష్, చరణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు ఆపాలి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తమ పాఠశాలల ప్రచారం, అడ్మిషన్ల కోసం ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిళ్లను ఆపాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు అందులో పని చేసే ఉపాధ్యాయులకు టార్గెట్‌లు విధించి అడ్మిషన్ల కోసం ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ పట్టణ నాయకులు రమణారెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

మైదుకూరు : పట్టణంలోని బద్వేలు రోడ్డులో మోటారు బైక్ నుంచి కింద పడి గాయాలై చికిత్స పొందుతున్న దాసరిగాండ్ల ప్రసాద్ (62) మృతి చెందినట్లు ఏఎస్‌ఐ చంద్రమౌళి సోమవారం తెలిపారు. విలియమ్స్ నగర్‌కు చెందిన ప్రసాద్ తన కుమారుడు మాధవయ్యతో కలసి ఆదివారం సాయంత్రం బైక్ పైన పొలానికి వెళుతుండగా పంది అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను చికిత్స కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సంస్కృతికి నిలువుటద్దం దేవాలయాలు

శివాలయానికి రూ.10 లక్షలు విరాళం అందించిన ఎమ్మెల్యే రాచమల్లు



గోపాయపల్లె శివాలయ నిర్మాణానికి డబ్బును విరాళంగా ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : మన సంస్కృతి, ఆధ్యాత్మికతకు నిలువుటద్దంగా దేవాలయాలు నిలుస్తాయని, అలాంటి గుడి నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని గోపాయపల్లె గ్రామంలోని శివాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదో ఉడతా భక్తిగా ఈ ఆలయ నిర్మాణానికి సహాయం అందించానని, ఈ గ్రామ ప్రజలు కోటికి పైగా విరాళాలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. రేపటి తరాలకు గుర్తుండే విధంగా ఎంతో అద్భుతంగా నిర్మాణ పనులు చేపట్టారని ఎమ్మెల్యే గ్రామ ప్రజలను అభినందించారు.ప్రజల పట్ల ప్రేమ, బాధ్యత, సేవాగుణంతో ఉన్నాం కాబట్టే వారి హృదయాల్లో ఉన్నామని, ఎన్నికల్లో గెలుస్తున్నామని చెప్పారు. అంతకుముందు రాచమల్లును జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీకుమారి, సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి బొకే ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

గోపాయపల్లె శివాలయానికి రూ.10 లక్షలు విరాళం

గోపాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంతంగా రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శివాలయానికి సహకరించాలని కొంతమంది గ్రామస్తులు అడిగారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి చేతుల మీదుగా పెద్దలకు ఆ మొత్తాన్ని అందించారు. వెల్లాల ఆలయాల మాజీ చైర్మన్ పట్టాభి సీతారామిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ప్రొద్దుటూరు, దువ్వూరు ఎంపీపీలు శేఖర్ యాదవ్, జయచంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని చర్చిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.2 లక్షలు డబ్బులు ఇవ్వాలని సంఘ పెద్దలు వచ్చి ఎమ్మెల్యేను అడుగగా ఇస్తానని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేసిన కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప పార్లమెంటు నియోజకవర్గంలోని కడప డిపోలో ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామని దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో శిక్షణ తీసుకున్న డ్రైవర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లు పూర్తి చేశామని, 15 బ్యాచ్‌కు సర్టిఫికెట్లను అందజేశామన్నారు. 16 బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నామని, 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. డ్రైవింగ్ నేర్చుకోదలచిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 16 బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుచున్నాయని, కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ కృష్ణారెడ్డి, జబ్బార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో ఏపీజీఈఏ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వద్ద ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రతినెల ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంఆర్ డైలీవేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని తెలిపారు. ఉద్యోగ సంఘాల నేతలను సంప్రదించిన తర్వాతే 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని అన్నారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాధ్యక్షులు రాజరాత్నం, రాష్ట్ర సీపీఎస్ రద్దు సమితి అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఆలూకా ఏపీజీఈఏ అధ్యక్షుడు డాక్టర్ హనీఫ్‌బాబా, కార్యదర్శి ప్రభాకర్, కమలాపురం తాలూకా అధ్యక్షుడు రామచంద్ర, గౌరవాధ్యక్షుడు మనీష్‌కుమార్, బద్వేలు తాలూకా అధ్యక్షుడు హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విదేశీ నాణెలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన



విదేశీ నాణెలు, కరెన్సీ నోట్లను తిలకిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విదేశీ నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సదాశివారెడ్డి 220 దేశాల నాణెలు, 110 దేశాల కరెన్సీ నోట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు దేశాల కరెన్సీ నోట్లను, నాణెలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై బాలికలకు అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న రేంజర్ వెంకటరమణారెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోమవారం రేంజర్ వెంకటరమణారెడ్డి లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. పర్యావరణ ప్రాధాన్యతపై బాలికలకు అవగాహన కల్పించారు. పర్యావరణం బాగా ఉండాలంటే మొక్కలు విస్తృతంగా పెంచాలన్నారు. పుట్టిన రోజు, పెళ్లిరోజు తదితర శుభకార్యాల సందర్భంగా అందరూ మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలన్నారు. అనంతరం లైఫ్‌స్టైల్ ఎన్విరాన్‌మెంట్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది శ్రీకృష్ణ, కరుణాకర్, వెంకటేష్, కిశోర్, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తమిద్దె రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు : షాపు రూంల బకాయిలను చెల్లించి అగస్త్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ కాలక్షేప మండలంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సంబంధించి 46 షాపింగ్ గదులు ఉన్నాయన్నారు. వీటికి రూ.35లక్షలు అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. త్వరగా బకాయిలు చెల్లిస్తే ఆలయ అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. భక్తులు ఆలయంలోని సమస్యలను తెలపుకోవడానికి ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ రాష్ట్ర మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక



ఏపీ రాష్ట్ర మాలహమాఆపీ రాష్ట్ర మాలమహానాడు నూతన కార్యవర్గం

ప్రొద్దుటూరు : స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీ రాష్ట్ర మాలమహానాడు (జాకాట విజయశేఖర్ వర్గం) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ తెలిపారు. జిల్లా గౌరవ సలహాదారులుగా ఎస్.లక్ష్మీనరసయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యామవరం కిరణ్, జిల్లా సెక్రటరీగా సి.యోగి, ప్రొద్దుటూరు మండల కార్యదర్శిగా సి.ఓబులేసులను, మరో పది మందిని ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల కోసం పోరాడుతామని వారు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తమాసు రాబర్ట్, జిల్లా మహిళా అధ్యక్షురాలు డి.రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడు మధు, పట్టణాధ్యక్షుడు స్వరూప్, మునెయ్య, సురేష్‌బాబు, సతీష్, మహేష్, నాగేంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

'పసివాడని జ్ఞాపకాలు' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరుకు చెందిన కవి, డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన 'పసివాడని జ్ఞాపకాలు' కవితా సంపుటిని అమరావతిలోని ఏపీ అసెంబ్లీ హాల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ డాక్టర్ పీపీకే రామాచార్యులు, జాయింట్ సెక్రటరీ పీపీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ కె.రాజకుమార్, అప్సా ప్రెసిడెంట్ కె.వెంకటరామిరెడ్డి, అప్సా జాయింట్‌సెక్రటరీ సత్య సులోచన, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ఎండోమెంట్స్ జాయింట్ సెక్రటరీ బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

'జైత్ర' యూనిట్‌కు అభినందనలు

ప్రొద్దుటూరు : 'జైత్ర' చిత్ర బృందం సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ రాయలసీమ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజంపేట, పులివెందులతోపాటు అనంతపురం జిల్లాలకు చెందిన యువకులు రైతుల సమస్యలపై సినిమా తీయడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సినిమాను తీసినందుకు వారిని అభినందించారు. జైత్ర సినిమా డైరెక్టర్ మల్లికార్జున, నిర్మాత సుభాష్, హీరో నవీన్, హీరోయిన్ రోహిణి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సన్మానం

చాపాడు : ఉత్తమ గ్రామ వలంటీర్లకు మంగళవారం సన్మాన సభ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా ఉత్తమ వలంటీర్లను ఘనంగా సన్మానించనున్నారు. మండల వ్యాప్తంగా 231 మంది వలంటీర్లను సన్మానిస్తుండగా వీరిలో ఒకరికి సేవా వజ్ర పురస్కారం ద్వారా రూ. 30 వేలు, 5 మంది సేవారత్న పురస్కారం ద్వారా రూ.20 వేలు, మిగిలిన వారికి సేవామిత్ర పురస్కారం ద్వారా రూ.10వేలు చొప్పున వలంటీర్ల ఖాతాల్లో నగదు జమచేయనున్నట్టు తెలిపారు.

ఆర్యవైశ్య మహిళలకు పెయింటింగ్‌లో శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అవోప కార్యాలయంలో గ్లాసు పెయింటింగ్, పాట్ పెయింటింగ్, జ్యువెలరీ మేకింగ్, క్లాత్ పెయింటింగ్ బేసిక్స్, వన్‌స్ట్రోక్ పెయింటింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు అవోప అధ్యక్షుడు పద్మనాభయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మే 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు రోజు ఉదయం 10 నుంచి 1 గంట వరకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు అవోప కార్యాలయంలో ఈనెల 26లోపు దరఖాస్తులను సమర్పించాలని, మరిన్న వివరాలకు 9441050122కు సంప్రదించాలని కోరారు.

సంతాపం

మైదుకూరు : ప్రముఖ కథారచయిత కేతు విశ్వనాథరెడ్డి మృతి సాహితీ రంగానికి తీరనిలోటని మైదుకూరుకు చెందిన 'చేతన సాహిత్య, సాంస్కృతిక సంస్థ' వ్యవస్థాపక అధ్యక్షుడు తోట రామ్మోహన్, కార్యవర్గ సభ్యుడు ఎస్ఆర్ ప్రతాప రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల వారు సంతాపం వ్యక్తం చేశారు.

బదిలీ ఉత్తర్వుల్లోని అసంబద్ధాలను తొలగించాలి

వైవీయూ: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వు 47లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ కోరారు. ఉపాధ్యాయుల ఖాళీల కోసం ప్రాతిపదికగా తీసుకునే తేదీని ఆగస్టు 2022 నుంచి మార్చి 2023కు మార్చాలని కోరారు. రేషనలైజేషన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు ప్రస్తుత స్టేషన్ పాయింట్లు ఇవ్వబడవన్న నిబంధనకు సవరణలు ఇవ్వాలన్నారు. ఖాళీలను బ్లాక్ చేసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలు యూనిట్‌గా వెబ్ ఆప్షన్స్ పెట్టుకునేందుకు ప్రత్యేక సర్వర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

మోసపూరిత యాప్‌లను అరికట్టండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జీవీ ఫుట్‌బాల్, మూన్ ఫుట్‌బాల్ లాంటి ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌ల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ తుషార్ దూడికి సీపీఐ నాయకులు వినతిపత్రమిచ్చారు.

పల్లె ముంగిటకు పూర్తి స్థాయి వైద్యం



మాట్లాడుతున్న స్టేట్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ అనిల్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : గ్రామ స్థాయిలోనే పూర్తి స్థాయి వైద్యం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్టేట్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి విలేజ్ క్లినిక్‌కు ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉంటాడన్నారు. వీరు గ్రామాల్లో పలు రకాల వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రథమ చికిత్స, పాము కాటు, ఐవీఫ్లూయిడ్స్, గాయాలు, సూదులు వేసే విధానం, డ్రెస్సింగ్ తదితర వాటి గురించి ట్రైనింగ్‌లో భాగంగా నేర్పిస్తారన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో శిక్షణ పొంది గ్రామ స్థాయిలో అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ శాంతికళ, డీపీయంఓ లక్ష్మీకర్, ఎపిడమాలజిస్టు ఖాజామొహిద్దీన్, వైద్యాధికారులు ఇలియారాణి, శివప్రసాద్‌రెడ్డి, నజీర్‌బాషా, నోడల్ ఆఫీసర్లు శివశంకరయ్య, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్స్ నిరూపమ, జయలక్ష్మి, ప్రసూనా, పద్మ పాల్గొన్నారు. అనంతరం సీహెచ్‌ఓలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

స్పందనతో సమస్యల పరిష్కారం



గంగనపల్లె సచివాలయంలో స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులు

కాశినాయన : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ ముజఫర్ రహీమ్, తహసీల్దార్ రామచంద్రుడు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంగనపల్లె సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు నాలుగు నెలలుగా రిజిస్టర్ భూమిని ఆన్‌లైన్ చేయాలని వీఆర్‌ఓ ఆనందరావు దృష్టికి తీసుకెళ్లామని, నాలుగు నెలలుగా తిప్పుకుంటూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి గ్రామంలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుందని, సంవత్సరం నుంచి ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని చెప్పారు. వారం లోపల సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసేందుకే 'స్పందన'

చాపాడు : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని మండల ప్రత్యేకాధికారి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామ సచివాలయం వద్ద సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలు వారి గ్రామాల్లోనే పరిష్కరించాలన్నారు. ప్రతి వారం గ్రామ సచివాలయం వద్ద అన్ని శాఖలకు చెందిన అధికారులందరూ హాజరవుతారని సమస్యలు ఉన్నవారు స్పందనలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి ప్రజలకు మంచి జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభాని, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మ్యాగి, గ్రామ సర్పంచ్ ప్రసాద్, డ్వాక్రా ఏపీఎం వెంకటరమణ, ఏపీఓ పద్మారాణి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో నాటి గురువులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక సీఎంఆర్ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

ఈ సమ్మేళనంలో తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా చదువు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ మెలగడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు మాల కొండయ్య, కొండయ్య, శ్రీరాములు, సిద్ధయ్య, ఖాదర్‌వలీ, యేసుదాసు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది

గోపవరం : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందించాలని తహసీల్దార్ దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాచాయపేట సచివాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హసీనా, పశువైద్యాధికారులు నరసింహారెడ్డి, కృష్ణవేణి, ఏఓ అరవిందనాయక్, సర్పంచ్ నాగేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పి. రమణారెడ్డి

వైవీయూ : ప్రభుత్వం నిర్వహించనున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ ఇలియాస్‌బాషా కోరారు. సోమవారం కడప నగరంలోని వీణావిజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల కోసం జీఓనెం. 47 జారీచేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు బదిలీలు ఉమ్మడి జిల్లాల యూనిట్‌గా నిర్వహించనున్నట్లు తెలిపారు. బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు మినిమం సర్వీసు జీరోగా నిర్ణయించినందున అందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 8 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుందన్నారు. రీ అపోర్స్‌మెంట్‌నకు గురైన జూనియర్ ఉపాధ్యాయునికి 5 పాయింట్లు ఇస్తామనే నిబంధన తొలగించి, విల్లింగ్ ఇచ్చిన సీనియర్‌కు కూడా పాయింట్లు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ విభాగం కన్వీనర్ టి. రవిశంకర్‌రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాషా, సాధిక్‌అలీ, సంజీవరాయయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'జైత్ర' ప్రీ రిలీజ్ ఈవెంట్



జైత్ర సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్/రూరల్:వ్యవసాయం ప్రధాన అంశంగా సుభాష్ నిర్మాణ సారథ్యంలో మల్లికార్జున దర్శకత్వంలో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ×జైత్ర₹ ప్రీ రిలీజ్ వేడుక కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నేత కల్లూరు నాగేంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాయలసీమ యాసలో ఇందులో చక్కగా చూపారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయనకులు షఫీ, భరత్, కో డైరెక్టర్ ధనుంజయరెడ్డి, హేమా రెడ్డి పాల్గొన్నారు.

'జైత్ర' సినిమాను జయప్రదం చేయాలి

మంచి సందేశంతో నిర్మించిన జైత్ర సినిమాను జయప్రదం చేయాలని ఆ చిత్ర దర్శకులు మల్లికార్జున్ తోట తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆ చిత్రం యూనిట్ సినిమాకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. ఈ ఈ నెల 26వ తేదీన విడుదలవుతున్న తమ చిత్రంను జయప్రదం చేయాలని కోరారు.